క్లుప్తంగా

మంత్రికి సన్మానం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న శివప్ప

సిద్దిపేటజోన్: రాష్ట్ర మంత్రి జూపల్లిని సిద్దిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శివప్ప ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌తో కలిసి సన్మానించారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండ పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం కొండపోచమ్మను దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.5 వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న రాంరెడ్డి

హుస్నాబాద్: ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5వేల కోట్ల నిధులతో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అప్పన్న రాంరెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెడ్లలో చాలా మంది పేదలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జేఏసీ నేతలు మల్లికార్జున్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఉన్నారు.

బీఆర్‌ఎస్ నేతలపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడంతో పాటు అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపరిచిన బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ మాట్లాడుతూ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నేతలపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పరశురాములు, గణేశ్, జయంత్, ప్రశాంత్, నాగరాజు, రాజు పాల్గొన్నారు.

మినీ స్టేడియంలో క్రికెట్ టోర్నీ

సిద్దిపేటఅర్బన్: సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా సిద్దిపేట మినీ స్టేడియంలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయా లని కాంగ్రెస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. నవంబర్ 8న సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌ను మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని, స్టేడియం వద్ద నిర్వహణ కమిటీ సభ్యులు అందుబాటులో ఉంటారని చెప్పారు. పాల్గొనే వారికి ఎలాంటి ఎంట్రీ ఫీజు ఉండదని తెలిపారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీరామ్

దౌల్తాబాద్(దుబ్బాక): దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ అన్నారు. మండల పరిధిలోని గాజులపల్లిలో పోలీసు కళాకారుల బృందం ఆదివారం నిర్వహించిన కనువిప్పు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. తల్లి దండ్రులు కూడా పిల్లలపై బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సాయిలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులే కల్లాలు



అల్వాలలో రోడ్డు పొడవునా ఆరబెట్టిన మక్కలు

ఆరుగాలం కష్టపడి పండించిన మక్కల ఆరబోతకు సరైన కల్లాలు లేక పోవడంతో రైతులు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. రైతులకు అవగాహన కలిగించే అధికారులు కరువయ్యారు. దీంతో రోడ్లన్నీ ధాన్యంతో నిండిపోతున్నాయి. మండల పరిధిలోని పలు రోడ్లపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. ధాన్యపు రాశుల కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. మిరుదొడ్డి(దుబ్బాక)

నిర్మించారు.. వదిలేశారు



అల్వాలలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్

వారాంతపు సంత కోసం మండల పరిధిలోని అల్వాలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు సుమారు రూ.12లక్షలతో కూరగాయల మార్కెట్ నిర్మించారు. యేళ్లు గడుస్తున్నా అధికారులు దానిని ప్రారంభించడంలేదు. దీంతో ఆ నిర్మాణం నిరుపయోగంగా మారింది. అన్ని వసతులతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను అధికారుల పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిరుదొడ్డి(దుబ్బాక)



మురుగును తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మురుగు కాల్వ శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని కడవేర్గు రోడ్డులో మురుగునీటితో నిండిన కాల్వను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్య పనుల నిర్వహణపై శనివారం సాక్షిలో ప్రచురితమైన 'పారిశుద్ధ్యం.. అధ్వానం..' అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆదివారం ఉదయం పారిశుద్ధ్య కార్మికులతో కాలువలోని మురుగును తొలగింపచేశారు.

బీఆర్‌ఎస్ నిరసనల హోరు

ప్రస్తుత ఖరీఫ్‌కు రైతు భరోసా ఇవ్వడం లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన ప్రకటనకు జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోను నిరసనలు వెల్లువెత్తాయి. బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ఆదివారం కూడా రాస్తారోకో, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలు చోట్ల సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మలు దహనం చేశారు. హుస్నాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసా ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి వెంటనే గద్దె దిగాలని, హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



హుస్నాబాద్: రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తదితరులు



దుబ్బాకటౌన్: రాయపోల్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



ములుగు(గజ్వేల్): ములుగులో బీఆర్‌ఎస్ శ్రేణుల రాస్తారోకో



మర్కూక్(గజ్వేల్): మర్కూక్‌లో..



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి క్రాసింగ్‌లో..



దౌల్తాబాద్(దుబ్బాక): దౌల్తాబాద్‌లో..



వర్గల్‌లో..



దుబ్బాకలో..



కోహెడ(హుస్నాబాద్): కోహెడలో..



కొండపాక(గజ్వేల్): వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద..

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్ రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. మండలంలోని మర్రిముచ్చాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పీఏసీఎస్ చైర్మన్ మెరెగు కృష్ణతో కలసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ఇప్పటి ప్రభుత్వం కూడా అనుసరించడం సంతోషకరమన్నారు. రైతుభరోసా, దొడ్డు రకం ధాన్యానికి బోనస్ చెల్లించాలని ప్రభుత్వానికి తెలియజేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మ, మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ,



కొమురవెల్లి(సిద్దిపేట): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, మాజీ ఎంపీపీ కీర్తన, సంపూర్ణ, సంగీత, నవీన్ పాల్గొన్నారు. అదేవిధంగా మద్దూరు మండలం వల్లంపట్ల, కూటిగల్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్వేత, వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, యాదగిరి, మాజీ వైస్ ఎంపీపీ సుమలత పాల్గొన్నారు.

పాఠశాలల పరిరక్షణలో ఉపాధ్యాయులే కీలకం

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ అన్నారు. నూతనంగా డీఎస్సీకి ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు సర్వీస్‌రూల్స్, లీవ్ రూల్స్‌పై ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అనేక సవాళ్లను ఎదుర్కొని పేద విద్యార్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రవీణ్, రాకేశ్, రాజలింగం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

అనిల్, సరిత, భార్గవి, మౌనిక, అన్వేషిత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట 33కేవీ ఫీడర్‌కు చెందిన మరమ్మతుల కారణంగా సోమవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏడీఈ పి.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటుగా లక్ష్మీదేవిపల్లి, ఇబ్రహీంపూర్, కోదండరావుపల్లి, బంజేరుపల్లి, రూరల్ మండల పరిధిలోని చింతమడక, మాచాపూర్, అంకంపేట, సీతారాంపల్లి గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌కు చెందిన బింగి స్వామి(42) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.



స్వామి(ఫైల్)

స్వామి ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. పనిలో భాగంగా గత 18న గాగిళ్లాపూర్ వెళ్లి తిరిగి వస్తుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న ఓ కారు ఢీకొంది. అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహం గుర్తింపు

బెజ్జంకి(సిద్దిపేట): సిద్దిపేటలోని నసీర్‌నగర్‌కు చెందిన షాబుద్దిన్(50 మృతదేహం మండలంలోని దేవక్కపల్లె శివారులోగల రాజీవ్ రహదారి పక్కన ఆదివారం గుర్తించినట్లు ఎస్‌ఐ



షాబుద్దిన్ (ఫైల్)

కృష్ణారెడ్డి తెలిపారు. షాబుద్దిన్‌కు మతిస్థిమితం లేక అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వస్తుంటాడు. అదే విధంగా గత 14న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అతడి మృతదేహం ఆదివారం లభించగా పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు ఆదివారం దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మండల పరిధిలోని బయ్యారం శివారులోని ఓ మేకల షెడ్డులో కొందరు పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.34,370 నగదు, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సైదా మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేదిలేదన్నారు.

హామీలు అమలు చేయకపోతే ఉద్యమిస్తాం

సిద్దిపేటఅర్బన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆరు గ్యారెంటీల పేరుతో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకపోతే ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం చెప్యాల బాలమణి అధ్యక్షతన అంబేడ్కర్ నగర్‌శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 40శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. ఇంతవరకు రైతులకు భరోసా వేయలేకపోయారని వాపోయారు. సంజీవ్ కుమార్, ఉమామహేశ్వరి, అర్చన, క్రాంతి, బాలు, నరసింహులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటజోన్: ఆదివారం నిర్వహించిన అలయ్ బలయ్‌లో పాల్గొన్న నాయకులు

కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అఖిలభారత నీలకంఠ సమాజం నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా కేంద్రంలోని నీలకంఠ దేవాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. అఖిలభారత నీలకంఠ సమాజం అధ్యక్షుడుగా లోక లక్ష్మిరాజం, ప్రధాన కార్యదర్శిగా గవ్వలశంకర్, కోశాధికారిగా కడవేర్గు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాజనర్సు, నరసింహులు, నగేష్, కృష్ణ, సుదర్శన్, లక్ష్మణ్, అశోక్, విఠల్, యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కోమ్మూరి పరామర్శ



చేర్యాల(సిద్దిపేట): మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు, కాంగ్రెస్ జిల్లా నాయకురాలు దాసరి కళావతిని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్య కారణంతో ఆసుపత్రిలోచేరి చికిత్సపొందిన ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలపై డీఈఓకు ఫిర్యాదు

సిద్దిపేటజోన్: సెలవు రోజైన ఆదివారం స్కోర్ ఎగ్జామ్ పేరిట ఓ ప్రైవేట్ పాఠశాలలో యాజమాన్యం నిబంధనలు అతిక్రమించిందని ప్రైవేటు టీచర్స్ ఫోరం డీఈఓకు ఫిర్యాదు చేసింది. స్థానిక సుడా కార్యాలయం సమీపంలోని ఆ విద్యాసంస్థను స్కోర్ ఎగ్జామ్ పేరుతో నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సంఘం ప్రతినిధులు వెళ్లి నిర్వాహకులను నిలదీశారు. అనంతరం డీఈఓ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, యాకుబ్, సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం

గజ్వేల్‌రూరల్/చిన్నకోడూరు(సిద్దిపేట)/చేర్యాల(సిద్దిపేట): పలువురు పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. గజ్వేల్ రూరల్ మండలంలోని అహ్మదీపూర్‌లోగల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకున్నప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సత్యనారాయణ, బసిరొద్దీన్, బంగారెడ్డి, జయరాములు, నర్సాగౌడ్‌ను సన్మానించారు. అలాగే చిన్నకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆ పాఠశాలలో ఆదివారం సందడి చేశారు. ఆనాటి తమ గురువులను సన్మానించారు. చేర్యాల మండలం ఆకునూరు ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, గురువులను ఘనంగా సన్మానించారు.



గజ్వేల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



చిన్నకోడూరు పాఠశాలలో..



చేర్యాల(సిద్దిపేట): ఆకునూరు ఉన్నత పాఠశాలలో..